ప్రజా మారుపు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 07 సంచిక : 57 గురువారం 29 - 10 - 2026 పేజీలు : 04 వెల రూ. 2

లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన బంజారాహిల్స్ ఎస్ఐ

తెలంగాణలో 'ఏఐ సాక్షమ్'

- ప్రభుత్వ సేవల్లో ఏఐ కార్యక్రమం ప్రారంభం
- పారదర్శకం చేసే లక్ష్యంతో ప్రభుత్వం 'ఏఐ సాక్షమ్' కార్యక్రమానికి శ్రీకారం
- 'ఏఐ సాక్షమ్' కార్యక్రమాన్ని ప్రారంభించిన మల్లు భట్టి విక్రమార్క
- రైతులు, పింఛనుదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలన్న డిప్యూటీ సీఎం
- ప్రజల డేటా భద్రతకే అత్యధిక ప్రాధాన్యమని వెల్లడి

హైదరాబాద్ :

తెలంగాణలో ప్రభుత్వ సేవలను మరింత వేగవంతం, పారదర్శకం చేసే లక్ష్యంతో ప్రభుత్వం 'ఏఐ సాక్షమ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచేందుకు ఉద్దేశించిన ఈ కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హైదరాబాద్‌లో ప్రారంభించారు. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం యొక్క ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో జరిగిన ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల - మిగతా 2 లో

తెలంగాణ రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది

- కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ రావు ధ్వజం
- మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలను దిగ్బంధించారన్న హరీశ్
- కరవుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవడం చేతకాని ప్రభుత్వమని విమర్శ
- ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్న

హైదరాబాద్ :

మూసీ నది ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకాకుండా బీఆర్ఎస్ నేతలను గృహనిర్బంధం చేశారని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. - మిగతా 2 లో

తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

- కీలక శాఖలకు కొత్త అధికారులు
- కీలక శాఖలకు కొత్త అధికారులను నియమించిన ప్రభుత్వం
- పంచాయతీరాజ్ శాఖకు నవీన్ మిట్టల్
- జీహెచ్ఎంసీ బాధ్యతలు సర్ఫరాజ్ అహ్మద్‌కు

హైదరాబాద్ :

తెలంగాణ ప్రభుత్వంలో పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. కీలక శాఖలకు నూతన అధికారులను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. - మిగతా 2 లో

తుపాను వేళ ఏపీకి అండగా తెలంగాణ ప్రభుత్వం

- ఉత్తరాంధ్రను అతలాకుతలం చేసిన అర్నబ్ తుపాను
- విపత్తులో ఏపీకి సాయం చేసేందుకు ముందుకొచ్చిన తెలంగాణ ప్రభుత్వం
- ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్ చేసిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి
- విద్యుత్ పునరుద్ధరణ పనులకు సిబ్బంది, సామగ్రి పంపుతామని హామీ
- తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి గొట్టిపాటి
- సహాయక చర్యల కోసం 6,000 మంది సిబ్బందిని మోహరించిన ఏపీ ప్రభుత్వం

హైదరాబాద్ :

అర్నబ్ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఏపీలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు, - మిగతా 2 లో

బ్యాలెట్‌తో ఎన్నికలు జరిగినా

ఓటమి తప్పలేదుగా

- మోనోకిల్ ఎమోజీతో కాంగ్రెస్‌పై మోదీ సెటైర్
- నాలుగు రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు
- 12 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్
- కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కని వైనం
- ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతో జరిగాయని గుర్తుచేసిన ప్రధాని మోదీ

ఢిల్లీ :

నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క స్థానాన్నీ గెలుచుకోలేకపోయింది. ఈ ఫలితాలపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యంగా స్పందించారు. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరిగాయని గుర్తుచేస్తూ, కాంగ్రెస్ ఎన్ని స్థానాలు గెలిచిందో ఊహించాలంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనికి 'మోనోకిల్' ఎమోజీని జతచేశారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, కర్ణాటక - మిగతా 2 లో

తుపాను పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్ష

- సెక్రటేరియట్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- అర్నబ్ తుపాను పరిస్థితిపై ఆర్టీజీఎస్‌లో సమీక్ష
- కూలిన చెట్లను వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశం
- రవాణా వ్యవస్థను తక్షణం పునరుద్ధరించాలని సూచన
- మనమిత్ర యాప్ ద్వారా ఫిర్యాదుల త్వరితగతిన పరిష్కారం

అమరావతి :

ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయానికి చేరుకుని, 'అర్నబ్' తుపాన్ ప్రభావిత జిల్లాల్లోని పరిస్థితిపై ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. 'రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ' (ఆర్టీజీఎస్) కేంద్రం నుంచి సీసీ కెమెరాల ద్వారా క్షేత్రస్థాయి పరిస్థితులను ఆయన నేరుగా పరిశీలించారు. తుపాను గమనం, ప్రస్తుత పరిస్థితి, క్షేత్రస్థాయిలో - మిగతా 2 లో

స్పెయిన్‌లో ఘోర రైలు ప్రమాదం..

రెండు హైస్పీడ్ రైళ్లు ఢీ

ఢిల్లీ :

స్పెయిన్ టోలెడో ప్రావిన్స్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. రెండు - మిగతా 2 లో

- ప్రమాదంలో 64 మంది మృతి
- టోలెడో ప్రావిన్స్‌లోని ఉర్దా స్టేషన్ సమీపంలో ఈ ఘటన
- ప్రమాద సమయంలో రైళ్లలో 544 మంది ప్రయాణికులు
- మాడ్రిడ్–అండలూసియా మార్గంలో రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిపివేత
- సహాయక చర్యలు కొనసాగుతున్నాయి

శిక్షణ కోసం భారత్ వైపు జపాన్ చూపు

2 లో..

ఆంధ్రప్రదేశ్ తీరాన్ని వణికించిన అర్నబ్

- నవంబర్ 3 వరకు వర్షాలు
- అర్నబ్ తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరాన్ని వణికించింది
- తీరప్రాంతాల్లో అలల ఉధృతి మీటరు వరకు ఎగసిపడుతున్నాయన్నారు
- గంటకు 125 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో గరిష్ఠంగా 150 కిలోమీటర్ల వేగంతో భీకర ఈదురుగాలులు
- నవంబర్ 3 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు
- కోస్తాంధ్ర, యానాంలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం
- పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి :

అర్నబ్ తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరాన్ని వణికించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కదిలిన ఈ తీవ్ర తుపాను తీరం దాటే సమయంలో గంటకు 125 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో గరిష్ఠంగా 150 కిలోమీటర్ల వేగంతో భీకర ఈదురుగాలులు వీచాయి. 48 గంటల్లో తుపాను బలహీనపడనుందని ఐఎండీ శాస్త్రవేత్తలు అంచనా వేశారు. కోస్తాంధ్ర–యానాం ప్రాంతాలలో ఈనెల 30 నుంచి నవంబర్ 3 వరకు, తెలంగాణలో ఈనెల 29 నుంచి నవంబర్ 3 వరకు, రాయలసీమ, తమిళనాడు, పుదుచ్చేరి, - మిగతా 2 లో

ఏపీలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు వాయిదా

- కొత్త తేదీలు ప్రకటన
- పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీలలో మార్పులు
- రాష్ట్రంలో జరగనున్న జిల్లా, మండల పరిషత్ ఎన్నికల తేదీల్లో మార్పులు చోటుచేసుకున్నాయి
- నవంబర్ 5న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నవంబర్ 7న కౌటింగ్ నిర్వహించనున్నారు

అమరావతి :

రాష్ట్రంలో జిల్లా, మండల పరిషత్ ఎన్నికల పోలింగ్‌ను రీషెడ్యూల్ చేశారు. ఈ మేరకు కొత్త తేదీలను ప్రకటించారు. నవంబర్ 3న జరగాల్సిన పోలింగ్‌ను నవంబర్ 5కు, నవంబర్ 5న జరగాల్సిన కౌంటింగ్‌ను నవంబర్ 7కు రీషెడ్యూల్ చేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఓ ప్రకటన విడుదల చేశారు. మరోవైపు పట్టణ స్థానిక - మిగతా 2 లో

సంపాదకీయం

యువకెరటం జయకేతనం!

శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ తర్వాత మరో దేశమైన సెర్బియాలో సైతం యువతరం తడాఖా చూపింది. ఆగ్నేయ యూరోప్‌లో డాన్యూబ్, సావా నదుల సంగమస్థలమైన దాని రాజధాని నగరం బెల్‌గ్రేడ్ సోమవారం లక్షలమంది జనంతో ఉప్పొంగిపోయింది. ఒక నాయకుడంటూ లేకుండా, నిర్దిష్టమైన విధివిధానాలు రూపొందించుకోకుండా విద్యార్థులు ఏకమై నెలకొల్పిన స్టూడెంట్ లిస్ట్ పార్టీ 53.3 శాతం ఓట్లతో, 140 స్థానాల్లో జయభేరి మోగించటం ఆ విజయోత్సవానికి కారణం. 250 స్థానాలున్న పార్లమెంటుకు పన్నెండేళ్ల క్రితం అధికారంలోకొచ్చిన ప్రస్తుత అధ్యక్షుడు అలెక్సాండర్ వూచిచ్ ఆ పక్కనున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఆదర్శంగా తీసుకుని రెండుసార్లు అధ్యక్షుడిగా పనిచేసి, మూడోసారికి కుదరదు గనుక ప్రధానిగా తిరిగొద్దామని ఎత్తుగడ వేశారు. కానీ తన పొరుగునున్న హంగేరీ అధ్యక్షుడు విక్టర్ ఒర్బాన్‌కు ఏమైందో గమనించుకోలేదు. తన మాదిరే ఎన్నికల సంఘం మొదలుకొని న్యాయవ్యవస్థ, మీడియా, పారిశ్రామికరంగం వరకూ అన్నిటినీ అధీనంలోకి తెచ్చుకుని తిరుగులేని అధికారం చలాయించిన ఒర్బాన్ పదహారేళ్ల అనంతరం మొన్న మే నెలలో పదవీచ్యుతుడయ్యారు. దాన్నుంచి వూచిచ్ ఏమీ నేర్చుకోలేదు సరిగదా... అవినీతి భూతాన్ని అదుపు చేద్దామన్న స్పృహ కూడా కొరవడింది. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ దేశాల్లో యువతరం హింసామార్గానికి మళ్లింది. అధికార సౌధాలపై దాడులకు దిగింది. పాలకుల్ని తరిమికొట్టింది. కానీ సెర్బియా యువతరం ఇందుకు భిన్నం. ప్రభుత్వం ఎంత రెచ్చగొట్టినా శాంతియుత మార్గాన్ని వీడలేదు. అందుకే రెండేళ్లనుంచి ఉద్యమం నిలకడగా సాగింది. దాన్ని అణిచేయటానికి వూచిచ్ చేయని ప్రయత్నమంటూ లేదు. తుపాకుల ప్రయోగం మినహా చేయాల్సిందంతా చేశారు. రాత్రి వేళల్లో అరెస్టులు, లాఠీచార్జిలు, పెప్పర్ స్ప్రే ప్రయోగాలు, ఉద్యమవేదికల్ని హఠాత్తుగా నిషేధిత ప్రాంతాలుగా ప్రకటించటం వగైరాలన్నీ ఉపయోగించారు. మాఫియా ముఠాలను రంగంలోకి దించారు. చురుగ్గా పనిచేసే నేతల్ని బెదిరించటం, దౌర్జన్యానికి దిగటం, ప్రధాన నగరాల్లో ప్రభుత్వ భవనాల దరిదాపుల్లోకొచ్చే యువకుల్ని బెదర గొట్టడం, ఇళ్లకు వెళ్లి చంపేస్తామని బెదిరించటం ఈ ముఠాల పని. ఉద్యమ నేతలను విదేశీ శక్తుల కిరాయిమనుషులుగా అనుకూల మీడియా సాగించిన ప్రచారం... ఉద్యమ కారుల బంధుమిత్ర గణం ద్వారా జనానికి చేరే సమాచారం ముందు వీగిపోయింది. విద్యార్థులు స్టూడెంట్ లిస్ట్ నేతలుగా వెలిగిపోవాలనుకోలేదు. నిజానికి 250 మంది జాబితాలో ఒక్క విద్యార్థి కూడా లేదు. రైతుల్ని, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లను, నటుల్ని, ఒపేరా గాయకుల్ని, క్రీడాకారుల్ని, వైద్యరంగ నిపుణుల్ని అభ్యర్థులుగా ఎంపిక చేసు కున్నారు. సంప్రదాయ పద్ధతుల్లో పార్టీ నెలకొల్పాలా వద్దా అని ఊగిసలాడినా చివరకు వివిధ నగరాలు, పట్టణాల్లోని కూడళ్లలో తరచు చర్చావేదికలు నిర్వహిస్తూ వచ్చారు. అక్కడే విధానాలు ఖరారయ్యేవి. ఆ విధానాలే ఇప్పుడు విజయాన్నిచ్చాయి. అయితే వూచిచ్ ఇంత త్వరగా పదవినుంచి తప్పుకుంటారని వారనుకోలేదు. బహుశా ఇదే బెల్‌గ్రేడ్‌లో 1903లో తన పేరేగల రాజుపై సైన్యం తిరుగుబాటుచేసి ఆయన్ని కిటికీ నుంచి విసిరేయడం గుర్తొచ్చి ఉండాలి. సైన్యం బలంతో అధికారానికి అంటిపెట్టుకుంటే కష్టాలు చవిచూడాల్సి వస్తుందని వూచిచ్ సరిగానే అంచనా వేసుకున్నారు. ఇంతకూ ఓడింది బ్రెజిల్‌లో మాదిరే మితవాద, జాతీయవాద పక్షమైనా... నెగ్గిందెవరో చెప్పటం అంత సులభం కాదు. వారు ఉదారవాదులనీ, అమెరికా డీప్ స్టేట్ ఏజెంట్లనీ వూచిచ్ ప్రచారం చేశారు. అటు ట్రంప్‌కు సైతం అలాంటి ఆశ ఉంది. బెల్‌గ్రేడ్‌లో ట్రంప్ టవర్‌కు వూచిచ్ అనుమతించకపోవడం ఆయనకు ఆగ్రహం కలిగించింది. కానీ స్టూడెంట్ లిస్ట్ అంత తేలిగ్గా అమెరికాను అక్కున చేర్చుకునే రకం కాదు. వారు మౌలికంగా ప్రజాస్వామికవాదులు. జాతీయవాదం తమలో ఏం తక్కువలేదని ఉద్యమ సందర్భంలో చాటారు. యూరోప్ యూనియన్(ఈయూ)లో చేరతామంటూనే సెర్బియా రష్యా వైపు మొగ్గడం ఆ సంస్థకు నచ్చలేదు. స్టూడెంట్ లిస్ట్ పార్టీకి ఈయూపై ఆసక్తే లేదు. మొత్తానికి నిలకడగా, సూత్రబద్ధంగా పోరాడి సాధించిన విజయం పాలనలో ఎన్నెన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.

ఆంధ్రప్రదేశ్ తీరాన్ని వణికించిన అర్నబ్

మొదటిపేజీ తరువాయి - కారైకాల్‌లలో నేటి నుంచి నవంబర్ 3 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అనకాపల్లి, విశాఖపట్నం, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కృష్ణ, బాపట్ల జిల్లాల్లో గంటకు 110-120 కిలోమీటర్ల వేగంతో గరిష్టంగా 130 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తున్నాయి. సాయంత్రానికి 70నుంచి 80 కిలోమీటర్ల వేగానికి తగ్గి, రాత్రికి 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో శీతల గాలులుగా మారుతాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాల్లో అలల ఉద్ధృతి మీటరు వరకు ఎగసిపడుతున్నాయన్నారు. ఇదిలా ఉండగా అర్నబ్ తుపాను ఉభయగోదావరి జిల్లాలతో పాటు, ఉత్తరాంధ్రలో బీభత్సం సృష్టించింది. ఈదురుగాలుల తీవ్రతకు పలు చోట్ల చెట్లు, విద్యుత్తు స్తంభాలు కూలిన ఘటనల్లో ఆరుగురు మృతి చెందారు. విశాఖ పాత గోశాల సమీపంలో విద్యుత్తు స్తంభం కూలి మహిళ మృతి చెందగా, విశాఖ బాలాజీనగర్‌లో విద్యుత్ స్తంభం కూలి కె.మాధవి దుర్మరణం చెందారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. భీమవరంలోని చర్చి వద్ద చెట్టు విరిగిపడి చొక్కా కిషోర్ (45) మృతి చెందగా, బొండాడవారివీధిలో విద్యుత్తు స్తంభం విరిగిపడి రాంబాబు (34) మృతి చెందారు. ఈదురుగాలుల ధాటికి భీమవరంలో దుకాణాలు, ఇళ్లు ధ్వంసమయ్యాయి. కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలోని ప్రకాష్‌పురంలో వృద్ధురాలు మృతి చెందారు. అదే జిల్లాలో ఈదురుగాలులు, వర్షానికి గుడిసె కూలి కొల్లు వెంకాయమ్మ దుర్మరణం చెందారు. అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో ఈదురుగాలులకు విద్యుత్తు తీగలు తెగి రోడ్డుపై పడ్డాయి. ఉదయాన్నే ప్రమాదవశాత్తూ ఇంటి ముందు ఉన్న విద్యుత్తు తీగలు తగిలి మహిళ మృతి చెందారు.

తుపాను పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్ష

మొదటిపేజీ తరువాయి - తీసుకుంటున్న చర్యల గురించి ఆర్టీజీఎస్ అధికారులు ముఖ్యమంత్రికి సమగ్రంగా వివరించారు. తుపాను కారణంగా పలుచోట్ల చెట్లు కూలిపోయిన నేపథ్యంలో ఎక్కడైనా ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయా అని సీఎం ఆరా తీశారు. జాతీయ రహదారులతో పాటు ఇతర మార్గాల్లో విరిగిపడిన చెట్లను తక్షణమే తొలగించి, రవాణా వ్యవస్థను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. తుపాను హెచ్చరికలు వచ్చినప్పటి నుంచి ఆర్టీజీఎస్ ద్వారా నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ముఖ్యమంత్రికి తెలిపారు. అదేవిధంగా ప్రజల నుంచి 'మనమిత్ర' యాప్ ద్వారా వస్తున్న ఫిర్యాదులను సంబంధిత అధికారులకు చేరవేసి, సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నట్లు అధికారులు వివరించారు. ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండి, సహాయక చర్యలను వేగవంతం చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు.

బ్యాలెట్‌తో ఎన్నికలు జరిగినా ఓటమి తప్పలేదుగా

మొదటిపేజీ తరువాయి - రాష్ట్రాల్లో మొత్తం 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ 12 స్థానాల్లో పోటీ చేసింది. గతంలో ఆ పార్టీ గెలిచిన నాలుగు స్థానాలు కూడా ఈ ఎన్నికల్లో ఉన్నాయి. అయినా ఈసారి ఒక్క చోటా విజయం సాధించలేకపోయింది. కర్ణాటకలో అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు సీటు దక్కకపోవడం గట్టి ఎదురుదెబ్బగా మారింది. ఈ ఫలితాలను ప్రస్తావిస్తూ మోదీ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఓటింగ్ యంత్రాల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ గతంలో ఆరోపణలు చేసింది. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని కూడా కోరింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతోనే జరిగాయని మోదీ గుర్తుచేశారు. అయినా కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదంటూ పరోక్షంగా ఎద్దేవా చేశారు.

తెలంగాణలో 'ఏఐ సాక్షమ్'



మొదటిపేజీ తరువాయి - వేగం పెంచి, ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రైతులు, పింఛనుదారులు వంటి వారు పదేపదే ఆఫీసుల చుట్టూ తిరిగే దుస్థితికి చరమగీతం పాడాలన్నారు. ప్రభుత్వ నిధుల వినియోగం, సంక్షేమ పథకాలు అర్హులకు చేరుతున్నాయా లేదా అనే విశ్లేషణ, విద్యుత్ డిమాండ్ అంచనా వంటి పనులకు ఏఐ ఎంతగానో తోడ్పడుతుందని వివరించారు. అదే సమయంలో ఏఐ వినియోగంలో పలు జాగ్రత్తలు తప్పనిసరి అని భట్టి నొక్కిచెప్పారు. ఏఐ అందించిన సమాచారాన్ని అధికారులు కచ్చితంగా ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత డేటా భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తామని, ఏఐ నిర్ణయాలపై మానవ పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. చిన్నస్థాయి ప్రయోగాలు విజయవంతమైన తర్వాతే ఏఐ వ్యవస్థలను విస్తరించాలని, ఏవైనా లోపాలు జరిగితే బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని అన్నారు. ప్రజలకు అందే వేగవంతమైన, పారదర్శక సేవలే ఏఐ విజయానికి గీటురాయి అవుతాయని ఆయన పేర్కొన్నారు.

ఏపీలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు వాయిదా

మొదటిపేజీ తరువాయి -

సంస్థల ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీల్లో ఎలాంటి మార్పులు లేవని స్పష్టం చేశారు. యథావిధిగా నవంబర్ 1న పోలింగ్, నవంబర్ 3న ఓట్ల లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు. అయితే ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 3న పరిషత్ పోలింగ్ జరగాల్సి ఉంది. అయితే అదే రోజున పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఒకే రోజున పట్టణ స్థానిక సంస్థల కౌంటింగ్, గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్ రెండూ ఏకకాలంలో నిర్వహిస్తే క్షేత్రస్థాయిలో తీవ్రమైన ఇబ్బందులు తలెత్తుతాయని ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారులు లోతుగా విశ్లేషించారు. అంతేకాక జిల్లాల్లో తగినంత మంది పోలీస్ బలగాలు, మైక్రో అబ్జర్వర్లు, పోలింగ్ సిబ్బందిని రెండు వేర్వేరు భారీ కార్యక్రమాలకు ఒకే సమయంలో కేటాయించడం కష్టసాధ్యమని గుర్తించారు. ఈ క్రమంలోనే ఎన్నికల నిర్వహణపరంగా తలెత్తే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పరిషత్ ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీలు వాయిదా వేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) భావించింది. ఈ మేరకు పరిపాలన పరమైన ఇబ్బందులు, భద్రతా సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని తేదీల్లో సవరణ చేస్తున్నట్లు ప్రకటించింది. ఎక్కడా ఎలాంటి లోపాలకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. జిల్లా, మండల పరిషత్‌లకు సవరించిన తేదీ ప్రకారం నవంబర్ 5న ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఒకవేళ రీపోలింగ్ అవసరమైతే నవంబర్ 6న ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తారు. ఓట్ల లెక్కింపు నవంబర్ 7న ఉండనుంది. మరోవైపు శాంతిభద్రతల పరిరక్షణ, మావోయిస్టు ప్రభావిత, సమస్యాత్మక ఏజెన్సీ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్ల దృష్ట్యా కొన్ని ప్రత్యేక ప్రాంతాల్లో మాత్రం పోలింగ్ సమయాన్ని కుదించారు. ఈ ప్రాంతాల్లో చీకటి పడేలోపు పోలింగ్ సిబ్బంది, సామగ్రి సురక్షిత ప్రాంతాలకు చేరేలా నిర్ణీత సమయం కంటే ముందే, అంటే సాయంత్రం మూడు గంటలకే పోలింగ్ ముగియనుంది. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 10 మండలాల పరిధిలో 44 అత్యంత సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలు, పోలవరం జిల్లాలోని ఏడు మండలాల పరిధిలోని 44 సున్నితమైన పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు గుర్తించింది. ఈ రెండు జిల్లాల పరిధిలోని 88 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్, రీ-పోలింగ్ ప్రక్రియలు సాయంత్రం మూడు గంటలకే ముగియనుంది. ఈ ప్రాంతాల ఓటర్లు ఈ విషయాన్ని గమనించి, ఎలాంటి గందరగోళానికి గురికాకుండా నిర్ణీత సమయంలోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ అమూల్యమైన ఓటు హక్కును వృథా కాకుండా వినియోగించుకోవాలని కోరింది. ఎన్నికల తేదీల్లో తలెత్తిన ఈ సవరణలను అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఓటర్లు గమనించి, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి కట్టుబడి సహకరించాలని ఎస్ఈసీ విజ్ఞప్తి చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లేలా, ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును ఉపయోగించుకునేందుకు వీలుగా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొంది.

స్పెయిన్‌లో ఘోర రైలు ప్రమాదం.. రెండు హైస్పీడ్ రైళ్లు ఢీ

మొదటిపేజీ తరువాయి - హైస్పీడ్ రైళ్లు ఢీకొన్న ఘటనలో 64 మంది మృతిచెందారు. పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. మూడు బోగీలు పట్టాలు తప్పగా, రెండు బోగీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారుఈ ఘటనపై స్పెయిన్ ప్రధానమంత్రి స్పందించారు. స్పెయిన్ రైల్వే నిర్వహణ సంస్థ ఏడీఐఎఫ్ తెలిపిన వివరాల ప్రకారం, దేశంలోని మధ్య ప్రాంతమైన టొలెడో ప్రావిన్స్‌లో ఈ ప్రమాదం జరిగింది. బుధవారం మాడ్రిడ్ నుంచి నైరుతి ప్రాంతంలోని సెవిల్లెకు వెళ్తున్న రెండు హైస్పీడ్ రైళ్లు ఒకే దిశలో ప్రయాణిస్తున్నాయి. వీటిలో ఒక రైలు ఆగి ఉండగా, వెనుక నుంచి వచ్చిన మరో రైలు దాని వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు బోగీలు పట్టాలు తప్పాయి. ఢీకొన్న తీవ్రతకు ఓ బోగీ పూర్తిగా ధ్వంసమై, దాని విడిభాగాలు సమీపంలోని వాలులో చెల్లాచెదురుగా పడిపోయాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. రెండు రైళ్లలో కలిపి 500 మందికిపైగా ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మూడు బోగీలు చెల్లాచెదురుగా పడి ఉన్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ప్రమాద తీవ్రత దృష్ట్యా మూడు హెలికాప్టర్లు, రెండు మొబైల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లను ఘటనా స్థలినికి పంపినట్లు ఓ అధికారి వెల్లడించారు. క్షతగాత్రులకు చికిత్స అందించేందుకు స్పోర్ట్స్ పెవిలియన్‌ను సిద్ధం చేశామని ఉర్దా మేయర్ తెలిపారు. ఈ ప్రమాదంతో మాడ్రిడ్ -అండలూసియా మధ్య రైళ్ల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. ప్రయాణికులకు అవసరమైన సహాయం అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఐఆర్‌వో సంస్థ కూడా తన భద్రతా ప్రోటోకాల్‌లను అమల్లోకి తెచ్చి, అధికారులతో కలిసి పనిచేస్తున్నట్లు వెల్లడించింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గురైన రైళ్లలో ఒకటి ప్రభుత్వ రంగ సంస్థ రెన్ఫేకు చెందినది కాగా, మరొకటి ప్రైవేటు సంస్థ ఐఆర్‌వోకు చెందినది. రెన్ఫే రైలులో 397 మంది, ఐఆర్‌వో రైలులో 147 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. స్పెయిన్ ఆరోగ్యశాఖ మంత్రి మోనికా గార్సియా తెలిపిన వివరాల ప్రకారం, అత్యంత తీవ్రంగా దెబ్బతిన్న రెండు బోగీల్లో చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావడంపై సహాయక బృందాలు దృష్టి సారించాయి. క్షతగాత్రులను సమీపంలోని వివిధ ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఢీకొన్న వేగం, తీవ్రతను బట్టి చూస్తే ఇది పెను విషాదంగా మారే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, అత్యవసర సేవల బృందాలతో పాటు సైనిక అత్యవసర విభాగాన్ని కూడా ప్రమాద స్థలానికి పంపించారు. క్షతగాత్రులకు చికిత్స అందించేందుకు ఉర్దా పట్టణంలోని క్రీడా ప్రాంగణాన్ని సిద్ధం చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంపై దృష్టి సారించేందుకు తన అధికారిక కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. బాధితులకు సహాయం అందించేందుకు అత్యవసర సిబ్బంది సంఘటనా స్థలంలో పనిచేస్తున్నారని తెలిపారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. కాస్టిల్లా-లా మాంచా ప్రాంత అధ్యక్షుడు ఎమిలియానో గార్సియా-పేజ్ కూడా ప్రమాద స్థలానికి బయలుదేరినట్లు వెల్లడించారు. స్పెయిన్‌లో ఈ ఏడాది జరిగిన రెండో పెద్ద రైలు ప్రమాదం ఇది. జనవరిలో దక్షిణ స్పెయిన్‌లో రైలు పట్టాలు తప్పి ఎదురుగా వస్తున్న మరో రైలును ఢీకొన్న ఘటనలో 45 మంది ప్రాణాలు కోల్పోయారు. 2013లో జరిగిన రైలు ప్రమాదంలో 80 మంది మృతి చెందగా, ఆ తర్వాత దేశంలో అత్యంత ప్రాణాంతకమైన రైలు ప్రమాదాల్లో జనవరి ఘటన ఒకటిగా నిలిచింది. తాజా ప్రమాదంతో స్పెయిన్ హైస్పీడ్ రైలు వ్యవస్థ భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

తుపాను వేళ ఏపీకి అండగా తెలంగాణ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి - ముఖ్యంగా విద్యుత్ పునరుద్ధరణ పనులకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తుపాను తీవ్రత, ఏపీలో జరిగిన నష్టం గురించి భట్టి విక్రమార్క ఆరా తీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో నష్టాన్ని తగ్గించడానికి, వీలైనంత త్వరగా పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి చేపడుతున్న చర్యలను మంత్రి గొట్టిపాటి ఆయనకు వివరించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, ప్రజల భద్రత కోసం తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి తెలిపారు. ఈ కష్టకాలంలో ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం అవసరమైతే సిబ్బందిని, అవసరమైన సామగ్రిని పంపడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ హామీతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు మరింత వేగవంతం అవుతాయని భావిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం అందించిన సహాయ హస్తానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో అండగా నిలుస్తామన్న భట్టి విక్రమార్కకు, తెలంగాణ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఈ సహకారం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అంతకుముందు, తుపాను సహాయక చర్యల కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే సుమారు 6,000 మంది అనుభవజ్ఞులైన సిబ్బందిని రంగంలోకి దించినట్లు గొట్టిపాటి తెలిపారు. తుఫాను పునరుద్ధరణ పనుల్లో అనుభవం ఉన్న అధికారులు, ఫీల్డ్ సిబ్బందిని అత్యవసర సేవల కోసం సిద్ధం చేశామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో డైరెక్టర్ల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆయన వివరించారు.

తెలంగాణ రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది

మొదటిపేజీ తరువాయి - రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పాలన సాగిస్తూ, ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. హైదరాబాద్‌లోని వాలంతరిలో మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ జరగాల్సి ఉంది. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి సిద్ధమైన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆమె కుమారుడు కార్తీక్ రెడ్డిలను పోలీసులు శ్రీనగర్ కాలనీలోని వారి నివాసంలో గృహ నిర్బంధం చేశారు. తెల్లవారుజాము నుంచే వారి ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించి, బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఈ ఘటనపై హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. "కరవుతో రైతులు అల్లాడుతుంటే ఆదుకోవడం చేతకాని ప్రభుత్వం, రూ. 1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన పేరుతో కమిషన్ల కోసం ప్రాజెక్టులు చేపడుతోంది" అని ఆరోపించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ, ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన ముసుగులో జరుగుతున్న దోపిడీ యత్నాలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందని, కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా అరెస్టులను ఖండించారు. ఇది అప్రజాస్వామిక చర్య అని, మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు అండగా నిలుస్తున్నందుకే తమను అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు. గృహనిర్బంధంలో ఉన్న బీఆర్ఎస్ నేతలను తక్షణమే విడుదల చేయాలని పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

మొదటిపేజీ తరువాయి - ఈ మేరకు పలువురు అధికారులకు కొత్త పోస్టింగులు కేటాయిస్తూ పరిపాలనలో మార్పులు చేపట్టింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్‌ను పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్ రాజ్‌కు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు గ్రామీణ నీటి సరఫరా శాఖల బాధ్యతలను నవీన్ మిట్టల్‌కు కేటాయించారు. ఇక రెవెన్యూ (దేవాదాయ) శాఖకు శైలజ రామయ్యర్‌ను, క్రీడలు మరియు వారసత్వ శాఖకు ఎ. వాణి ప్రసాద్‌ను బదిలీ చేశారు. రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా శాఖ కార్యదర్శిగా కె. ఇలంబర్తి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శిగా ముషారఫ్ అలీ ఫరూఖీ నియమితులయ్యారు. జీహెచ్‌ఎంసీతో పాటు సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల అదనపు బాధ్యతలను సర్ఫరాజ్ అహ్మద్‌కు కేటాయించారు. మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ బాధ్యతలను శ్రుతి ఓఝాకు అప్పగించగా, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా డాక్టర్ సంగీత సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించనున్నారు. టీజీఎస్పీడీసీఎల్, టీజీరెడ్కో బాధ్యతలను జితేష్ వి. పాటిల్‌కు కేటాయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ ఉత్తర్వులు జారీ చేశారు.

శిక్షణ కోసం భారత్ వైపు జపాన్ చూపు

మొదటిపేజీ తరువాయి - భారత్, జపాన్ మధ్య రక్షణ సంబంధాలు మరింత బలపడుతున్నాయి. తమ సైన్యానికి అత్యాధునిక క్షిపణుల వినియోగంపై శిక్షణ ఇచ్చేందుకు భారత్‌లోని శిక్షణా కేంద్రాలను వినియోగించుకోవాలని జపాన్ భావిస్తోంది. ఈ మేరకు తమ సిబ్బందిని చర్చల కోసం భారత్‌కు పంపినట్లు జపాన్ గ్రౌండ్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ (జీఎస్‌డీఎఫ్) చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ మసయోషి అరాయ్ స్వయంగా వెల్లడించారు. సుమారు 1,000 కిలోమీటర్ల పరిధి కలిగిన ఉపరితలం నుంచి నౌకలను ఛేదించే క్షిపణులపై సమర్థవంతమైన శిక్షణ ఇవ్వడం తమకు పెద్ద సవాలుగా మారిందని జనరల్ అరాయ్ తెలిపారు. ఈ నేపథ్యంలో దేశీయంగా, విదేశాల్లో శిక్షణా అవకాశాలను పరిశీలిస్తున్నామని, ఇందులో భాగంగానే భారత్‌తో సంప్రదింపులు జరుపుతున్నామని వివరించారు. కేవలం క్షిపణులే కాకుండా, చిన్న తరహా అటాక్ డ్రోన్ల ప్రయోగానికి గల అవకాశాలపై కూడా చర్చిస్తున్నట్లు ఆయన ధ్రువీకరించారు. సంక్లిష్టంగా మారిన భద్రతా వాతావరణంలో ఇండో-పసిఫిక్‌లో భారత్‌ను జపాన్ ఒక ముఖ్యమైన భాగస్వామిగా చూస్తోందని, రక్షణ సహకారాన్ని మరింత పటిష్ఠం చేసుకోవాలని కోరుకుంటోందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, భారత్‌తో ఉన్న సంబంధాల సున్నితత్వం దృష్ట్యా పూర్తి వివరాలను వెల్లడించలేనని జనరల్ అరాయ్ పేర్కొన్నారు. కాగా, ఈ నెల 6 నుంచి 9 వరకు జపాన్ జీఎస్‌డీఎఫ్ కమాండ్ నుంచి 34 మంది సభ్యుల ప్రతినిధి బృందం భారత్‌లో పర్యటించింది. ఈ బృందం భారత సైన్యం, డీఆర్‌డీవో అధికారులతో సమావేశమైంది. వార్‌డెక్, క్లాస్ వంటి కేంద్రాలను సందర్శించి భారత రక్షణ సామర్థ్యాలు, సైనిక శిక్షణ, ఆధునిక సాంకేతికత గురించి తెలుసుకున్నారు. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య వృత్తిపరమైన సైనిక సంబంధాలను మరింతగా పెంచేందుకు దోహదపడింది.

ఒడిశా, తమిళనాడులో అర్నబ్ బీభత్సం

బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నబ్ తుపాను బీభత్సం సృష్టించింది. ఆంధ్రప్రదేశ్?తో పాటు ఒడిశా, తమిళనాడులో జనజీవనాన్ని ప్రభావితం చేసింది. ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిశాయి. ఒడిశాలో చెట్లు కూలి రహదారులు మూసుకుపోగా, కొన్ని ప్రాంతాల్లో వంతెన కూలడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. 234 మంది గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించగా, 73 మంది మహిళలకు సురక్షితంగా ప్రసవాలు జరిగాయి. మరోవైపు చెన్నై విమానాశ్రయంలో 12 విమానాలను రద్దు చేయగా, రైళ్ల రాకపోకలపై ఆంక్షలు విధించారు. తుపాను ప్రభావంతో ఒడిశాలోని గజపతి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో పెద్దపెద్ద చెట్లు నేలకూలడంతో రహదారులపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నదులు, వాగుల్లో నీటిమట్టాలు పెరుగుతున్నాయి. ఆర్.ఉదయగిరి బ్లాక్‌లోని కైరభఫ్ వాగులో నీటిమట్టం పెరగడంతో కానకట-పురుణపాణి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాలో సుమారు 30 ప్రాంతాల్లో చెట్లు కూలి రహదారులు మూసుకుపోయినట్లు అధికారులు గుర్తించారు. వీటిలో దాదాపు 25 ప్రాంతాల్లో అగ్నిమాపక సిబ్బంది చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. మిగిలిన ప్రాంతాల్లోనూ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మోహన ప్రాంతంలోని గుండరీగుడా వంతెన కూలిపోవడంతో నదికి అవతలి వైపున ఉన్న నాలుగు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇక రాయగడ జిల్లాలో తుపాను ముప్పును దృష్టిలో ఉంచుకుని యంత్రాంగం అప్రమత్తమైంది. రానున్న 15 రోజుల్లో ప్రసవ తేదీ ఉన్న 234 మంది గర్భిణులను సురక్షిత ప్రాంతాల్లోని మాతృగృహాలు, ఆస్పత్రులకు తరలించారు. ఒక్కరోజులోనే 73 మంది మహిళలకు ప్రసవాలు జరిగాయని, తల్లులు, శిశువులు క్షేమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాలోని ముటుకుణి గ్రామం నుంచి సుమారు 46 నుంచి 48 మందిని జయపంగ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆశ్రయ కేంద్రానికి



తరలించారు. వరద ముప్పు పెరిగితే గుణుపూర్ ప్రాంతంలోని మరికొన్ని గ్రామాల ప్రజలను కూడా ఖాళీ చేయించేందుకు ఏర్పాట్లు చేశారు. సహాయక చర్యల కోసం మూడు ఓడ్రాఫ్ బృందాలు, ఒక ఎన్‌డీఆర్ఎఫ్ బృందం, 11 అగ్నిమాపక బృందాలను సిద్ధంగా ఉంచారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో రహదారులను శుభ్రం చేసేందుకు జేసీబీ యంత్రాలను అందుబాటులో ఉంచారు. తుపాను ప్రభావం దక్షిణ ఒడిశాలోని గజపతి, గంజాం, రాయగడ, కోరాపుట్, నబరంగ్‌పూర్, మల్కాన్‌గిరి జిల్లాలపై ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఈ ఆరు జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు లక్ష మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేశ్ పూజారి వెల్లడించారు. గంజాం, గజపతి, రాయగడ, నబరంగ్‌పూర్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇక తుపాను ప్రభావంతో చెన్నై విమానాశ్రయంలో 12 విమానాలను రద్దు చేశారు. విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి నగరాల నుంచి చెన్నైకి వచ్చే ఆరు విమానాలతో పాటు చెన్నై నుంచి ఆయా నగరాలకు వెళ్లాల్సిన మరో ఆరు విమానాలను నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తుపాను కారణంగా పలు రైళ్లను కూడా రద్దు చేయడంతో పాటు మరికొన్ని మార్గాల్లో మార్పులు చేశారు. భువనేశ్వర్-జగదల్‌పూర్ హీరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌ను రాయగడ వరకు పరిమితం చేయడంతో పాటు తిరుగు ప్రయాణంలోనూ మార్పులు చేశారు. తుపాను ప్రభావంతో చెన్నైలోని ఎన్నోర్, పట్టినపాక్కం, బెసెంట్ నగర్ తీర ప్రాంతాల్లో సముద్ర అలలు ఎగసిపడ్డాయి. ఎన్నోర్‌లో ఐదు అడుగులకు పైగా ఎత్తులో వచ్చిన అలలు తీర రక్షణ గోడలను దాటి రహదారులపైకి దూసుకొచ్చాయి. ఎన్నోర్ ఎక్స్‌ప్రెస్‌వేపై వాహనాలు అలల తాకిడికి కదిలిపోయాయి. పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజల రాకపోకలను నియంత్రించారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ సిబ్బంది రాత్రంతా ఇసుక, రాళ్లను తొలగించి రహదారులను శుభ్రం చేశారు. నీటిని మోటార్ల సాయంతో బయటకు పంపించారు. ఉదయానికి పరిస్థితి మెరుగుపడటంతో రాకపోకలు తిరిగి సాధారణ స్థితికి చేరుకున్నాయి. తీర ప్రాంతంలో భవిష్యత్తులో ఇలాంటి నష్టం జరగకుండా అలల ఉద్ధృతిని తగ్గించే రక్షణ నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎన్‌డీఆర్ఎఫ్, ఓడ్రాఫ్, అగ్నిమాపక, పోలీసు బృందాలు సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నాయి. గంజాం జిల్లాలో అక్టోబర్ 27 నుంచి 29 వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించారు. పిల్లలు, గర్భిణులకు అవసరమైన పొడి రేషన్‌ను ఇళ్లకు చేరవేయాలని ఆదేశించారు. ప్రజలు వాతావరణ శాఖ, ప్రత్యేక సహాయ కమిషనర్, జిల్లా యంత్రాంగం విడుదల చేసే అధికారిక సమాచారాన్నే అనుసరించాలని అధికారులు సూచించారు. వరదనీరు ప్రవహించే రహదారులు, దెబ్బతిన్న వంతెనలపై ప్రయాణించవద్దని, అత్యవసర పరిస్థితుల్లో అధికారుల సహాయం తీసుకోవాలని హెచ్చరించారు.

పోక్సో చట్టంపై న్యాయ అవగాహన కార్యక్రమం - పోస్టర్ విడుదల

జగిత్యాల అక్టోబర్ 28 (ప్రజా మంటలు) : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డి ఎల్ ఎస్ ఏ) ఆధ్వర్యంలో బుధవారం జగిత్యాల పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించే పోక్సో చట్టం--2012 (పోక్సో యాక్ట్) పై న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి సరిత మట్టా హాజరై విద్యార్థినులకు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీమతి సరిత మట్టా మాట్లాడుతూ, 18 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన పిల్లలను లైంగిక దాడులు, లైంగిక వేధింపులు మరియు లైంగిక దోపిడీ నుంచి రక్షించేందుకు పోక్సో చట్టం--2012 రూపొందించబడిందని వివరించారు. బాలల హక్కులను పరిరక్షించడం, వారిపై జరిగే లైంగిక నేరాలను అరికట్టడం, బాధితులకు చట్టపరమైన రక్షణ కల్పించడం ఈ చట్టం ముఖ్య

ఉద్దేశమని తెలిపారు. విద్యార్థినులు తమ వ్యక్తిగత భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా లేదా వేధింపులకు పాల్పడినా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసు అధికారులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. బాలలపై జరిగే నేరాలను నివారించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు మరియు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. అనంతరం, పోక్సో చట్టానికి సంబంధించిన అవగాహన పోస్టర్‌ను కార్యదర్శి శ్రీమతి సరిత మట్టా విడుదల చేశారు. బాలల రక్షణ, వారి హక్కులు, లైంగిక నేరాల నివారణ మరియు చట్టపరమైన రక్షణ చర్యలపై విద్యార్థినుల్లో అవగాహన పెంపొందించేందుకు ఈ పోస్టర్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కె. చంద్ర మోహన్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సురేష్, న్యాయవాదులు మమత, స్వప్న, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, వారికి చట్టాలపై అవగాహన కల్పించడం మరియు సురక్షితమైన వాతావరణాన్ని నిర్మించడం లక్ష్యంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జగిత్యాల ఆధ్వర్యంలో ఇటువంటి న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

రాయికల్ అక్టోబర్ 28 (ప్రజా మంటలు) : మండలం లోని తాట్లవాయి గ్రామంలో రూ.10 లక్షల నిధులతో నిర్మించిన వెలుగుబాట మహిళా సంఘ భవనాన్ని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘ భవనం ద్వారా గ్రామంలోని మహిళలకు వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు సౌకర్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఆడబిడ్డలకు కట్నంగా ప్రతి గ్రామంలో మహిళా సంఘ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని, మహిళలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. మహిళా సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదిగి స్వయం సమృద్ధి సాధించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కొత్త రేషన్ కార్డుల పంపిణీ వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. తాను రాజకీయాల్లోకి రాకముందే రాయికల్ మండలంలో అనేక ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు సేవ చేశానని, అప్పటి నుంచి ఇక్కడి ప్రజలు, నాయకులతో తనకు మంచి అనుబంధం ఏర్పడిందని ఎమ్మెల్యే అన్నారు. ఆ అనుబంధాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. రానున్న ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. విద్యుత్‌ను కూడా అవసరానికి అనుగుణంగా పొదుపుగా వినియోగించాలని ఎమ్మెల్యే సూచించారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆకుల మల్లేశం, డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య, ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ రవీందర్ రావు, మాజీ ఎంపీపీ సంధ్యారాణి సురేందర్ నాయక్,

ఎంపీడీవో చిరంజీవి, ఎమ్మార్వో నాగార్జున, పీఏసీఎస్ చైర్మన్లు తంగెళ్ల రమేష్, నిమ్మల శేఖర్ రెడ్డి, ఎనుగు మల్లారెడ్డి, మరిపెల్లి శ్రీనివాస్ గౌడ్, మండల నాయకులు కోల శ్రీనివాస్, ముకీద్ , మాజీ సర్పంచ్ శ్రీనివాస్, వెంకటేశ్వర్ రావు, వార్డు సభ్యులు, మహిళలు, అధికారులు మండల గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

పోలీస్ అమరవీరుల సంస్మరణ లో బాగంగా రక్తదాన శిబిరం

జగిత్యాల అక్టోబర్ 28 (ప్రజా మంటలు) : పోలీస్ అమరవీరుల సంస్మరణ లో భాగంగా పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ లో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. బ్లడ్ డొనేషన్ క్యాంప్ కు ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ హాజరుకావడం జరిగింది. ఈ సందర్భంగా వివిధ సర్కిల్ సి. ఐ లు ఎస్.ఐ మరియు పోలీస్ సిబ్బంది, యువత స్వచ్ఛంద రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... పోలీస్ అమరవీరుల సంస్మరణలో భాగంగా ప్రతి సంవత్సరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. పోలీస్ అమరవీరులను ఎప్పటికీ మర్చిపోకుండా,నిత్యం గుర్తు చేసుకోవడానికి జిల్లాలో పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా అనేక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పోలీసులు

చేపడుతున్న ఇట్టి కార్యక్రమాలకు యువత నుండి అనూహ్య స్పందన రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం ద్వారా తాజాగా శరీరంలోకి కొత్త రక్తం ఉత్పత్తి అయ్యి ఆరోగ్యంగా ఉంటామని సూచించారు. కావున ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడటానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ యొక్క రక్తదాన శిబిరంలో పాల్గొని బ్లడ్ డొనేట్ చేసిన ప్రతి ఒక్కరికి పోలీస్ శాఖ తరఫున అభినందనలు తెలిపారు. ఈ మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, పోలీస్ అధికారులను అభినందించారు. ప్రమాదంలో గాని, విద్యుత్ పొదుపును జీవితంలో భాగంగా చేసుకోవాలని పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ లు పురుషోత్తం రెడ్డి, జిల్లా వైద్యాధికారి సుజాత, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ మంచాల కృష్ణ, టీపీ సూర్యం సభ్యులు, ఇన్స్పెక్టర్ సుధాకర్, కరుణాకర్, రాజ్ కుమార్, తిరుపతి, వేణు, సైదులు , మరియు ఎస్.ఐ లు, పోలీస్ సిబ్బంది, యువత, పాల్గొన్నారు.

తెలంగాణ కాంగ్రెస్ శ్రేణులను మోదీ అడ్డుకోలేరు

డాక్టర్ కోట నీలిమ

రైల్ కేటాయింపు నిరాకరణపై రైల్ నిలయం ముట్టడి

టీపీసీసీ నేతల అరెస్ట్

సికింద్రాబాద్, అక్టోబర్ 28 (ప్రజా మంటలు): ఢిల్లీ వేదికగా నిర్వహించే భారీ బహిరంగ సభకు తరలివెళ్లకుండా తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలను ప్రధాని నరేంద్ర మోదీ అడ్డుకోలేరని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కోట నీలిమ ధ్వజమెత్తారు. నవంబర్ 1న ఢిల్లీలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చిన 'ఓట్ బచావో -- దేశ్ బచావో' సభకు రాష్ట్రం నుంచి వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లు కేటాయించకపోవడంపై కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. రైల్వే శాఖ వైఖరికి నిరసనగా సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు బుధవారం భారీ ధర్నా చేపట్టారు. ఈ ఆందోళన సందర్భంగా ఉద్రిక్తత చోటుచేసుకోవడంతో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులతో పాటు డాక్టర్ కోట నీలిమను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం డాక్టర్ కోట నీలిమ మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీ సభలో పాల్గొనేందుకు తెలంగాణ నుంచి 10 వేల మందికి పైగా పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్‌కు దేశవ్యాప్తంగా లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే రాజకీయ కక్షతో మోదీ ప్రభుత్వం ప్రత్యేక రైళ్లను కేటాయించకుండా అడ్డంకులు సృష్టిస్తోందని మండిపడ్డారు. రైల్వే శాఖ తీరుపై శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే అక్రమ అరెస్టులకు పాల్పడటం దారుణమన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా కాంగ్రెస్

శ్రేణులను ఎవరూ ఆపలేరని, ప్రత్యామ్నాయ మార్గాల్లోనైనా ఢిల్లీకి చేరుకుని సభను విజయవంతం చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

స్ట్రోక్ పట్ల నిర్లక్ష్యం

శాశ్వత వైకల్యానికి ఆహ్వానం!

మెడికవర్ ఆసుపత్రి డా.దూస శ్రీనివాసరావు వెల్లడి

సికింద్రాబాద్, అక్టోబర్ 28 (ప్రజా మంటలు): మెదడుకు రక్త సరఫరాలో అంతరాయం ఏర్పడినా లేక మెదడులో రక్తస్రావం జరిగినా ప్రాణాలకే ప్రమాదమని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ దూస శ్రీనివాసరావు హెచ్చరించారు. స్ట్రోక్ బాధితుడిని సకాలంలో ప్రతి నిమిషం ఎంతో కీలకమని, చికిత్సలో ఏమాత్రం ఆలస్యం జరిగినా తీవ్ర మెదడు నష్టం వాటిల్లి శాశ్వత పక్షవాతానికి దారితీసే ముప్పు ఉందని ఆయన స్పష్టం చేశారు. సికింద్రాబాద్ మెడికవర్ హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్‌గా సేవలందిస్తున్న ఆయన స్ట్రోక్ నివారణ, తక్షణ చికిత్స ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. భారత్‌లో ప్రతి సంవత్సరం లక్షలాది మంది స్ట్రోక్ ప్రభావానికి గురవుతున్నారు. ముఖం ఒకవైపునకు వాలిపోవడం, చేయి లేదా కాలు అకస్మాత్తుగా బలహీనపడటం, మాట ముద్దగా రావడం, తడబడటం, చూపు మందగించడం వంటివి స్ట్రోక్ ప్రధాన లక్షణాలు. చాలామంది వీటిని సాధారణ నీరసంగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారు. ముఖ్యంగా అర్ధరాత్రి వేళల్లో ఈ లక్షణాలు కనిపిస్తే తెల్లవారే వరకు వేచి చూడటం అత్యంత ప్రమాదకరమని, తక్షణమే అత్యవసర విభాగానికి తరలించాలని వైద్యులు సూచించారు. రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం వల్ల వచ్చే ఇస్కిమిక్ స్ట్రోక్ బాధితులకు 'గోల్డెన్ అవర్'లోనే థ్రాంబోలైటిక్ చికిత్స అందిస్తే మెదడుకు రక్తప్రసరణను పునరుద్ధరించవచ్చు. కొందరిలో గడ్డను తొలగించే అధునాతన ప్రక్రియలు అవసరమవుతాయి. బ్రెయిన్ స్కాన్ ఫలితాలు, లక్షణాలు మొదలైన సమయం ఆధారంగా ఈ నిర్ణయం తీసుకుంటారు. అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్, ధూమపానం, మద్యపానం, గుండె జబ్బులు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాల ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని స్పష్టం చేశారు. కేవలం ప్రాణాలను కాపాడటమే కాకుండా బాధితులు తిరిగి సాధారణ జీవితం గడిపేలా చేయడంలో ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, స్పీచ్ థెరపీ వంటి పునరావాస సేవలు విశేష పాత్ర పోషిస్తాయి. మెడికవర్ ఆసుపత్రిలో స్ట్రోక్ రోగుల సమగ్ర సంరక్షణ కోసం అధునాతన చికిత్సలతో పాటు ప్రత్యేక పునరావాస సేవలు అందుబాటులో ఉన్నాయని, లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రికి చేరడమే వైకల్యాన్ని నివారించే ఉత్తమ మార్గమని డాక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

చింతకుంట చెరువు పరిరక్షణకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలి : జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్

జగిత్యాల, అక్టోబర్ 28(ప్రజా మంటలు) : జగిత్యాల మున్సిపల్ పరిధిలోని చింతకుంట చెరువు పరిరక్షణకు సమగ్ర ప్రణాళిక రూపొందించి, తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ మున్సిపల్, నీటిపారుదల (ఇరిగేషన్) శాఖల అధికారులతో కలిసి చింతకుంట చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు ప్రస్తుత పరిస్థితి, పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, సంబంధిత అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. చెరువు పరిరక్షణకు అవసరమైన సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసి, చెరువు స్థలాన్ని కాపాడేందుకు తగిన రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం నూతనంగా నిర్మించనున్న కోర్టు భవనాల సముదాయానికి కేటాయించిన స్థలాన్ని, అలాగే ఆర్డీవో (ఆర్ డి ఓ) కార్యాలయ భవన నిర్మాణానికి కేటాయించిన భూమిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆయా స్థలాలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకొని, నిర్మాణ పనులకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లపై సమీక్షించారు. తదుపరి మున్సిపల్ పరిధిలోని వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ (డబ్ల్యూ టి పి)ను పరిశీలించి, అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల అమలులో జాప్యం లేకుండా నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణతో పాటు, ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి, వాటి పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్‌తో పాటు మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యం

మంద జగన్

బౌద్ధనగర్ డివిజన్‌లో దోమల నివారణ చర్యలు పరిశీలన

సికింద్రాబాద్, అక్టోబర్ 28 (ప్రజా మంటలు): ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యమని, పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులను అరికట్టవచ్చని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు మంద జగన్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన బౌద్ధనగర్ డివిజన్ పరిధిలోని అంబర్ నగర్‌లో విస్తృతంగా పర్యటించారు. స్థానికంగా దోమల బెడద తీవ్రంగా ఉండటాన్ని గమనించిన ఆయన, వెంటనే జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన జీహెచ్ఎంసీ సిబ్బంది క్షేత్రస్థాయికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ ప్రాంతంలో దోమల ఉధృతి, మురుగు నిల్వలు, పారిశుధ్య పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు, వెంటనే ఫాగింగ్, స్ప్రేయింగ్ తదితర నివారణ చర్యలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య సూపర్‌వైజర్లు చంద్రశేఖర్‌రెడ్డి, అజయ్, శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌తో పాటు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వ్యర్థాలను వేరు చేసి కాలుష్యాన్ని నివారిద్దాం

కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి

మెట్పల్లి అక్టోబర్ 28 (ప్రజా మంటలు దగ్గుల అశోక్) : మెట్పల్లి పరిధిలో వెల్లుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రోజున "ఈ - వ్యర్థాల సేకరణ మరియు భాధ్యతయుతంగా పారవేయడం"(ఇ-పారావేయడం) ... కార్యక్రమం ను నిర్వహించడం జరిగింది. తెలంగాణ "పాఠశాల విద్యా శాఖ"వ "ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్" సంయుక్తంగా నిర్వహించిన" ఈ - వ్యర్థాల"సేకరణపై మొదటగా విద్యార్థులకు అవగాహన కల్పించి, ఈ రోజు విద్యార్థుల ఇండ్లల్లో పాడైనా, చెడిపోయిన ఎలక్ట్రానిక్ పరికరాలు, బ్యాటరీలు, మొబైల్ ఫోన్, చార్జర్స్, కంప్యూటర్ పరికరాలు, కేబుల్స్, టీవీ రిమోట్ లను తెప్పించి పాఠశాల లో ఏర్పాటు చేసిన నల్లటి రంగు ఉన్న బిన్ లో" ఈ- వ్యర్థాలను"సేకరించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పాడైనా బ్యాటరీ లలో ఉండే సీసం, పాదరసం లు భూమిలోకి చేరి నీటిని, పంటలను కలుషితం చేస్తాయని, వాటిని కాల్చిన వాయు కాలుష్యం ఏర్పడి పిల్లలకు శ్వాసకోస, చర్మ వ్యాధులు వస్తాయని, కావున విద్యార్థులు పాడైనా ఎలక్ట్రానిక్ పరికరాలను ఇతర వ్యర్థా లతో కలపకుండా వేరు చేసి పాఠశాల లోని "నల్లటి బిన్ "లో వేసినట్లయితే వాటిని అధీకృత" ఈ రైక్లింగ్ "సెంటర్ కు అప్పగిస్తామని, ఇందుకు ప్రతి ఒక్కరు భాధ్యత తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో కో ఆర్డినేటర్ జగదీశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూపతిపూర్ ప్యాక్స్ కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

రాయికల్ అక్టోబర్ 28 (ప్రజా మంటలు) : భూపతిపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్ శేఖర్ రెడ్డి మరియు నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి భూపతిపూర్ గ్రామానికి హాజరై శు భాకాంక్షలు తెలిపిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేందర్, డీసీసి అధ్యక్షులు గజంగి నందయ్య, ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, రాయికల్ జగిత్యాల ఏ ఎం సి చైర్మన్ లు రవీందర్ రావు, గడ్డం నారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీ సంధ్యారాణి సురేందర్ నాయక్, కోల శ్రీనివాస్, మండల గ్రామ నాయకులు రైతులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష పోస్ట్ కార్డు ఉద్యమం అభినందనీయం

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల. జితేందర్

హైదరాబాద్ అక్టోబర్ 28 (ప్రజా మంటలు) : గాంధీ భవన్ లో కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి బోగోజు ముకేశ్ కన్నా ఆధ్వర్యంలో సి ఈ సి జ్ఞానేశ్ కుమార్ కమిషనర్ పదవి నుండి తప్పించాలని రాష్ట్రపతి కి "లక్ష పోస్టు కార్డుల పంపిణీ"కార్యక్రమం ను రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు మిద్దెల. జితేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ఎస్ ఐ ఆర్ కార్యక్రమం ద్వారా పౌరులకు ఓటు హక్కును దూరం చేస్తున్నారని దీనికి కమిషనర్ హోదాలో సి ఈ సి జ్ఞానేశ్ కుమార్ సహకరిస్తున్నారని తక్షణమే కమిషనర్ పదవి నుండి జ్ఞానేశ్ కుమార్ గారిని తప్పించాలని లేని పక్షంలో, పార్లమెంట్లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రజల తరుపున పోరాటం చేస్తామని, సేవాదళ్ తరుపున "లక్ష పోస్ట్ కార్డుల పంపిణీ" ఉద్యమం చేపట్టిన కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ముకేశ్ ఖన్నా ను పార్టీ తరుపున అభినందనలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమం లో మహిళా సేవాదళ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కుమారి సునీత రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వాజిద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్, ఫసియుద్దీన్, పిట్టల. బాల రాజు, ఇతిశర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష

విధించిన ధర్మపురి మెజిస్ట్రేట్

గొల్లపల్లి అక్టోబర్ 28 ప్రజా మంటలు : వెల్గటూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశానుసారం రోడ్డు ప్రమాదాల నియంత్రణకై మంగళవారం డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వ్యక్తిని కోర్టులో హాజరు పరచగా ధర్మపురి మెజిస్ట్రేట్ యేగి జానకి వెల్గటూర్ మండలానికి చెందిన సత్తయ్య కు మూడు రోజుల జైలు శిక్ష విధించారు సందర్భంగా ఎవరైనా వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై,ఉదయ్ కుమార్ తెలిపారు

వివేకానంద యూత్ నూతన అధ్యక్షుడిగా శ్రీకాంత్

భీమదేవరపల్లి అక్టోబర్ 28 (ప్రజా మంటలు): స్థానిక వివేకానంద యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో నూతన అధ్యక్షుడిగా గుడికందుల శ్రీకాంత్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యుల వివరాలను వెల్లడించారు. సంఘం గౌరవ అధ్యక్షులుగా సకినాల రమేష్, బైరి సదానందం, ఉపాధ్యక్షుడిగా పిట్టల శ్రీధర్,

ప్రధాన కార్యదర్శిగా గనవేని విజయ్, కోశాధికారిగా గుడికందుల శ్రీనివాస్, సహాయ కోశాధికారిగా దూలం జగన్ ఎన్నికయ్యారు. అలాగే కమిటీ సభ్యులుగా గుడికందుల సదానందం, భువనగిరి గణేష్, గుడికందుల రాజయ్య, పిట్టల యుగంధర్, ఉడుత శ్రీనాథ్, బైరి రాంబాబు, బసవరాజు రమేష్, బైరి మోహన్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వివేకానంద యూత్ ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధికి, సేవా కార్యక్రమాలకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు గ్రామస్తులు, పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి

సీఎం చంద్రబాబు ఆదేశం

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తుపానుపై రాష్ట్ర స్థాయి యంత్రాంగం మొదలుకొని క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరితో సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. తుపానుపై రాష్ట్ర స్థాయి యంత్రాంగం మొదలుకొని క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం జిల్లాల్లో పరిస్థితిని, సహాయక చర్యలను సమీక్షించారు. తుపాను కారణంగా ఎక్కడైనా ప్రాణనష్టం సంభవించిందా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతానికి ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని నివేదికలు వచ్చినట్లు అధికారులు వివరించారు. వివిధ జిల్లాల్లో వర్షం తగ్గుముఖం పట్టినా ఈదురుగాలులు వీస్తున్నాయని కలెక్టర్లు తెలిపారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఆస్తి నష్టాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ముఖ్యంగా చిన్న నీటిపారుదల చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, చెరువులు పొంగిపొర్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సాగునీటి సంఘాలతో సమన్వయం చేసుకోవాలని, చెరువులకు వస్తున్న నీటి ప్రవాహాలను గమనిస్తూ స్థానిక ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్లకు సూచించారు. చెరువులు, కాల్వలకు గండ్లు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని, చెట్లు కూలిన ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తుపాను షెల్టర్లలో ఆశ్రయం పొందుతున్న వారిని పరిస్థితులు పూర్తిగా కుదుటపడ్డాకే ఇళ్లకు పంపించాలని చంద్రబాబు స్పష్టం చేశారు.సహాయక చర్యల్లో అధికారులు, సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిస్థితి, పునరుద్ధరణ చర్యలపై సుదీర్ఘంగా సమీక్షించారు. తుపాను ప్రభావంతో ఇవాళ, రేపు (బుధ, గురువారాలు) రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, ప్రచండ గాలులు వీస్తున్న నేపథ్యంలో ఎక్కడా ప్రాణనష్టం కూడా జరగకుండా ప్రభుత్వం పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలపై అధికారులకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ముందస్తు చర్యల వల్ల ఇప్పటివరకు ఎక్కడా ఎలాంటి ప్రాణనష్టం నమోదు కాలేదని అధికారులు సీఎంకు నివేదించారు.ఉత్తరాంధ్ర, కోస్తాను ముంచెత్తిన వర్షాలు : తుపాను ల్యాండ్‌ఫాల్ సమయం లోనూ, ఆ తర్వాతా కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో వానలు బీభత్సం సృష్టించాయని అధికారులు సీఎంకి వివరించారు. ముఖ్యంగా విశాఖపట్నంలో అత్యధికంగా 12 సెంటీమీటర్లు, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో 9 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైందని తెలిపారు. పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో ఇప్పటివరకు 5 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయిందని కాకినాడలో గంటకు 120 నుంచి 140 కిలోమీటర్ల వేగంతో ప్రచండ ఈదురుగాలులు వీచగా అమలాపురంలో అతి భారీ వర్షాలు కురుస్తున్నాయని చెప్పారు. వర్షం కొద్దిగా తగ్గుముఖం పట్టినా తీర ప్రాంతాల్లో ఈదురుగాలుల తీవ్రత ఇంకా కొనసాగుతూనే ఉందని వివరించారు.తుపాను ప్రభావంతో పలు జిల్లాల్లో వందలాది చెట్లు రహదారులపై విరిగిపడ్డాయని కోనసీమ జిల్లాలో సుమారు 6 వేల విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్లు జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరించారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను ముందే నిలిపివేసినట్లు అధికారులు వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ప్రాంతంలో రహదారులపై పడిన చెట్లను సిబ్బంది యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నారని చెప్పారు.యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టండి : రహదారులపై కూలిన చెట్లను వెంటనే తొలగించి ఎక్కడా రవాణాకు ఆటంకం కలగకుండా చూడాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. తుపాను తీవ్రత, గాలుల వేగం తగ్గిన వెంటనే ప్రాధాన్యతా క్రమంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని వర్షాల వల్ల చెరువులు, కాల్వలు పొంగిపొర్లకుండా నీటిపారుదల శాఖ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఏపీపై 'అర్నబ్' పంజా పలు విమానాలు రద్దు

ఏపీలో అర్నబ్ ప్రభావంతో పలు విమానాలను రద్దు చేశారు. భోగాపురం, విజయవాడ, రాజమహేంద్రవరం నుంచి పలు విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అర్నబ్? అతి తీవ్ర తుపానుగా బలపడింది. గడిచిన 6 గంటల్లో గంటకు 18 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. విశాఖకు 170 కిలోమీటర్లు, కాకినాడకు 140 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 230 కిలోమీటర్లు, బాపట్లకు 300 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. రేపు (బుధవారం) ఉదయంలోపు బాపట్ల-విశాఖ మధ్య యానాం సమీపంలో తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గరిష్ఠంగా గంటకు 150 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఈ సమయంలో ప్రజలు బయటకు రావొద్దని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలకు తుపాను హెచ్చరికతో పాటు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే అర్నబ్ తుపాను తీవ్రత దృష్ట్యా భోగాపురం విమానాశ్రయం నుంచి పలు విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు. భోగాపురం నుంచి కర్నూలు తిరుపతి, దిల్లీ, హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతా, చెన్నైకి వెళ్లాల్సిన 16 విమానాలను రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అదేవిధంగా విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే 6 విమాన సర్వీసులను ఇవాళ రద్దు చేశారు. బుధవారం కూడా ఇండిగో సంస్థకు చెందిన అన్ని విమాన సర్వీసులను, ఎయిర్ ఇండియా దిల్లీ విమాన సర్వీసు, ఫ్లై91 సంస్థకు చెందిన రెండు హైదరాబాద్ విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.రాజమహేంద్రవరం నుంచి వెళ్లాల్సిన విమానాలన్నీ రద్దు చేశారు. దిల్లీ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబయి, వెళ్లాల్సిన ఇండిగో, ఫ్లై-90 విమానయాన సంస్థలకు చెందిన 20 విమానాలు రద్దు చేసున్నట్లు అధికారులు ప్రకటించారు. విమాన సర్వీసుల రద్దుతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వర్షంలోనూ వైభవంగా పైడితల్లి సిరిమానోత్సవం లక్షలాదిగా తరలివచ్చిన భక్తజనం

ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు, విజయనగరం ప్రజల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. జోరు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా, లక్షలాది మంది భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర కల్పవల్లి, విజయనగరం ప్రజల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. పూజారి బంటుపల్లి వెంకట్రావు సిరిమాను ఎక్కి ఊరేగింపులో పాల్గొన్నారు. జోరు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఉత్తరాంధ్రతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. సిరిమాను రూపంలో దర్శనమిచ్చిన పైడితల్లి అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. సుమారు 3 లక్షలమందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు.మూడుసార్లు పురవీధుల్లో ఊరేగింపు: విజయదశమి అనంతరం వచ్చే తొలి మంగళవారం నిర్వహించే సిరిమానోత్సవం పైడితల్లి జాతరలో ప్రధాన ఘట్టం. అమ్మవారి ప్రతిరూపంగా భావించే సిరిమానుపై ప్రధాన పూజారి బంటుపల్లి వెంకట్రావు ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ఊరేగింపు సాయంత్రం 4.40 గంటలకు ముగిసింది. ఆలయం నుంచి అమ్మవారి పుట్టినిల్లుగా భావించే కోట వరకు సిరిమాను మూడుసార్లు ఊరేగింది. పాలధార, అంజలి రథం, తెల్ల ఏనుగు, జాలరి వల వాహనాలు ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జై పైడితల్లి నామస్మరణతో విజయనగరం పురవీధులు మార్మోగాయి. రహదారుల ఇరువైపులా, భవనాలపై వేచివున్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని జేజేలు పలికారు.అధికారుల పర్యవేక్షణ: వర్షం కారణంగా ఈసారి భక్తుల రాక కొంత తగ్గినా, ఉత్సవ సందడి మాత్రం ఎక్కడా తగ్గలేదు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్ వర్షంలోనూ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. భారీ పోలీసు బందోబస్తు, వివిధ శాఖల అధికారుల సమన్వయంతో వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. గోవా గవర్నర్, ఆలయ ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, పలువురు ప్రజాప్రతినిధులు ఉత్సవాన్ని తిలకించారు.11 వరకు జాతర వేడుకలు: అక్టోబరు 1న మండల దీక్ష, ఆలయాల వద్ద పందిరిరాట కార్యక్రమాలతో జాతర ప్రారంభమైంది. ఈ నెల 22న అర్ధమండల దీక్ష, 26న తొలేళ్ల ఉత్సవం నిర్వహించారు. సిరిమానోత్సవం ప్రధాన ఘట్టం కాగా, మిగిలిన సంప్రదాయ వేడుకలతోనూ జాతర సందడి కొనసాగుతుంది. నవంబరు 3న తెప్పోత్సవం, 7న కలశజ్యోతి ఊరేగింపు, 10న ఉయ్యాల కంబాల ఉత్సవం నిర్వహించనున్నారు. నవంబరు 11న చండీహోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలతో జాతర ముగియనుంది. పైడితల్లి అమ్మవారి జాతర భక్తుల విశ్వాసానికి, విజయనగరం సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయి.

అర్నబ్ తుపాను ఎఫెక్ట్: తెలంగాణకు భారీ వర్ష సూచన.. రైళ్లు, విమానాల రద్దు

అర్నబ్ తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో జనజీవనంపై ప్రభావం పడుతోంది. తెలంగాణలో బుధవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాష్ట్రంలోని జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్, హనుమకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.తుపాను కారణంగా రవాణా వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సోమవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విజయవాడ, విశాఖపట్నం వెళ్లాల్సిన పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. తుపాను పరిస్థితుల కారణంగానే విమానాలను రద్దు చేసినట్లు జీఎంఆర్ వర్గాలు ప్రకటించాయి. ఈ పరిస్థితి మరో రెండు రోజుల పాటు కొనసాగవచ్చని విమానాశ్రయ అధికారులు అంచనా వేస్తున్నారు.మరోవైపు, దక్షిణ మధ్య రైల్వే కూడా అప్రమత్తమైంది. కోస్తాంధ్ర, తూర్పు తెలంగాణలో భారీ వర్షాల నేపథ్యంలో రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుజాగ్రత్త చర్యగా మంగళవారం 11 రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. రద్దయిన రైళ్లలో ఫలక్‌నుమా, గోదావరి, విశాఖ, గౌతమి, కోకనాడ, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందు రైళ్ల ప్రస్తుత స్థితిని ఐఆర్‌సీటీసీ, ఎన్‌టీఈఎస్ వంటి అధికారిక యాప్‌లలో సరిచూసుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

నమ్మిన కార్పెంటరే నగలు, నగదు కాజేశాడు మారేడుపల్లి భారీ చోరీ కేసు ఛేదన

బంగారం చోరీ కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. నిందితుడి నుంచి రూ.1.80 కోటి విలువైన బంగారంతో పాటు రూ.15 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.ఇటీవల మారేడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. నెహ్రూనగర్ కాలనీలో నివాసం ఉంటున్న డాక్టర్? దంపతుల ఇంటిని లక్ష్యంగా చేసుకొని, కొన్నాళ్లుగా ఆ ఇంట్లోనే కార్పెంటర్?గా విధులు నిర్వహిస్తున్న వెలిశాల భరత్ దొంగతనానికి పాల్పడ్డట్లు మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ తెలిపారు. నిందితుడి నుంచి రూ.1.8 కోట్ల విలువైన ఒక కిలో బంగారంతో పాటు రూ.15 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీకి ప్లాన్

గత కొన్ని సంవత్సరాలుగా వైద్యుల దంపతుల ఇంట్లో కార్పెంటర్‌గా విధులు నిర్వహిస్తున్న భరత్, ఇటీవల తన ఇంటి నిర్మాణం కోసం రూ.40 లక్షల రుణం తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇంటి కోసం తీసుకున్న రుణాన్ని చెల్లించేందుకు దొంగతనానికి పాల్పడాలనే ఉద్దేశంతో, డాక్టర్ దంపతులు ఖమ్మంకు వెళ్లిన సమయంలో చోరీకి పాల్పడ్డాడు. నకిలీ తాళాలతో ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న విలువైన బంగారు ఆభరణాలతో పాటు నగదుతో పరారయ్యాడు. వైద్య దంపతులు ఇంటికి వచ్చి చూసేసరికి దొంగతనం జరిగినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు.మారేడుపల్లి పీఎస్ పరిధిలో ఈ నెల 22వ తేదీన ఓ ఫిర్యాదు వచ్చింది. నెహ్రూనగర్ కాలనీలోని సాయి రెసిడెన్సీలో నివాసం ఉంటున్న మోహన్ దంపతులు నర్సింగ్ హోమ్‌లో వైద్యులుగా పని చేస్తున్నారు. వారు 20వ తేదీన ఖమ్మం వెళ్లి తిరిగి 22న ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో దొంగతనం జరిగినట్టుగా గుర్తించారు. మొదట రూ.15 లక్షల నగదు, 70 తులాల బంగారం పోయినట్టు ఫిర్యాదు ఇచ్చారు. అనంతరం వాళ్లు నిర్ధారించుకొని, మొత్తం కిలో 180 గ్రాముల బంగారం పోయినట్టుగా గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు మారేడుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు." - శ్రీధర్, మల్కాజిగిరి డీసీపీ

వెలిశాల భరత్‌కు వైద్య దంపతులకు మధ్య 12 ఏళ్ల పరిచయం

వెలిశాల భరత్‌కు, వైద్య దంపతులకు మధ్య సుమారు 12 ఏళ్ల పరిచయం ఉంటుంది. దంపతుల బంధువులకు, స్నేహితులకు, పిల్లలకు అందరికీ కార్పెంటర్ పనికి ఇతన్నే రెఫర్ చేస్తున్నట్లు దంపతులు తెలిపారు. ఈ రకంగా ఆ ఇంట్లో చొరవ ఎక్కువగా ఉండేది. ఇటీవల వైద్యులకు ఆస్తి ఎక్కువ ఉంటుందని కార్పెంటర్ తెలుసుకున్నాడు. భరత్ తన ఇంటి నిర్మాణం కోసం దాదాపు రూ.40 లక్షలు లోన్ తీసుకున్నట్లు గుర్తించడం జరిగింది. అయితే దంపతుల ఆస్తి విలువ తెలుసుకున్న భరత్, ఇంట్లో చోరీ చేస్తే తన ఇంటి నిర్మాణం ఎలాంటి అప్పు లేకుండా పూర్తవుతుందనే ఉద్దేశంతో సరైన సమయం చూసుకుని దొంగతనానికి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని పెద్ద అంబర్‌పేట్ వద్ద పట్టుకున్నారు."దర్యాప్తులో భాగంగా అక్కడ ఉన్నటువంటి ఆధారాల ప్రకారం ఈ దంపతుల వద్దకు తరచుగా పనికి వస్తుండే కార్పెంటర్ వెలిశాల భరత్ ఈ నేరానికి పాల్పడ్డట్టు గుర్తించడం జరిగింది. ఆ తర్వాత అతన్ని ట్రేస్ చేస్తూ వెళ్లినప్పుడు దొంగతనం చేసిన వస్తువులన్నీ కూడా తన తల్లిదండ్రుల ఇంట్లో దాచి పెట్టినట్లు గుర్తించాం. అక్కడ రూ. 15 లక్షల నగదు, కేజీ 180 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకోవడం జరిగింది." - శ్రీధర్, మల్కాజిగిరి డీసీపీ

బంగారు ఆభరణాలు, రూ.15 లక్షల నగదు స్వాదీనం

దర్యాప్తులో భాగంగా అక్కడ ఉన్న ఆధారాల ప్రకారం ఈ దంపతుల వద్దకు తరచుగా పనికి వస్తుండే కార్పెంటర్ వెలిశాల భరత్ ఈ నేరానికి పాల్పడ్డట్టు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత అతన్ని ట్రేస్ చేస్తూ వెళ్తున్న క్రమంలో తన తల్లిదండ్రుల ఇంట్లో దొంగతనం చేసిన వస్తువులన్నీ కూడా అక్కడ దాచి పెట్టినట్లు గుర్తించారు. అక్కడ రూ.15 లక్షల నగదు, ఒక కేజీ 180 గ్రాముల గోల్డ్ ఆభరణాలు స్వాధీనం చేసుకోవడం జరిగింది.చోరీ జరిగిన అపార్ట్‌మెంట్‌లో సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగతనం ఛేదించేందుకు శ్రమించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా సీసీ కెమెరాలను అమర్చుకోవాలని డీసీపీ శ్రీధర్ ప్రజలకు తెలిపారు. విలువైన వస్తువులను ఇంట్లో కాకుండా బ్యాంకులో భద్రపరచుకోవాలని సూచించారు.

ధరల భారం నుంచి ఊరట.. తెలంగాణలో ఇక బియ్యంతో పాటు నిత్యావసరాలు!

తెలంగాణలో పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, ఎల్ నినో ప్రభావంతో కరవు పరిస్థితులు తలెత్తవచ్చన్న ఆందోళనల నేపథ్యంలో పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం రేషన్ కార్డులపై పంపిణీ చేస్తున్న సన్నబియ్యంతో పాటు కందిపప్పు, గోధుమపిండి, పామాయిల్, చక్కెర, చింతపండు, కారంపొడి వంటి మరిన్ని సరుకులను అందించే ప్రతిపాదనను తీవ్రంగా పరిశీలిస్తోంది.ఈ ప్రతిపాదన సాధ్యాసాధ్యాలపై సమగ్రంగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల అవసరాలు, సరుకుల సేకరణకు ఏర్పాట్లు, ఎంత పరిమాణంలో ఇవ్వాలి ఎంతకాలం కొనసాగించాలి బడ్జెట్‌పై పడే భారం వంటి అంశాలను అంచనా వేయాలని సూచించారు. ఆర్థిక, లాజిస్టిక్స్ పరమైన అంశాలు కొలిక్కి వస్తే, వచ్చే సంక్రాంతి నాటికి ఈ పథకాన్ని ప్రారంభించే అవకాశం ఉందని తెలుస్తోంది.రాష్ట్రంలో ప్రస్తుతం 1.06 కోట్ల ఆహార భద్రత కార్డులపై సుమారు 3.42 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి నెలకు తలసరి 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తున్నారు. ఇందుకు నెలకు 2.18 లక్షల టన్నుల బియ్యం అవసరం. భవిష్యత్ అవసరాల దృష్ట్యా 14 నెలలకు సరిపడా ఆహార ధాన్యాల బఫర్ స్టాక్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం గోదాముల్లో 9.64 లక్షల టన్నుల బియ్యం నిల్వ ఉండగా, కస్టమ్ మిల్లింగ్ రైస్, ఇతర మార్గాల ద్వారా మరో 18.39 లక్షల టన్నులు సమకూరనున్నాయి. ఈ నిల్వలు 2027 సెప్టెంబర్ వరకు సరిపోతాయని అధికారులు భావిస్తున్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో రేషన్ షాపుల ద్వారా పలు రకాల నిత్యావసరాలను అందించేవారు. 2023లో అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ కూడా ఇదే తరహాలో పంపిణీని విస్తరిస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు ఆ దిశగానే ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బహిరంగ మార్కెట్‌లో ధరల పెరుగుదల నుంచి ప్రజలను ఆదుకోవడమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందిస్తున్నారు. అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా ఏయే సరుకులు ఎంత పరిమాణంలో ఇవ్వాలనే దానిపై కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుంది.

ఉద్యోగి ఆత్మగౌరవమే ముఖ్యం

వెయిటర్‌ను కొట్టిన గెస్ట్‌పై తాజ్ హోటల్ జీవితకాల నిషేధం

ఆగ్రాలోని తాజ్ హోటల్‌లో వెయిటర్‌పై చేయిచేసుకున్న అతిథి

నిందితుడిని జీవితకాలం బ్లాక్‌లిస్ట్ చేసిన హోటల్ యాజమాన్యం

ఉద్యోగం పోతుందనే భయంతో విషయం దాచిపెట్టిన వెయిటర్

ఉద్యోగుల ఆత్మగౌరవమే ముఖ్యమని స్పష్టం చేసిన ఎండీ పరితోష్ లధానీ

ఆగ్రాలోని ప్రఖ్యాత తాజ్ హోటల్‌లో ఓ వెయిటర్‌పై అతిథి చేయిచేసుకున్న ఘటన సంచలనం సృష్టిస్తోంది. ఈ అమానుష ఘటనపై హోటల్ యాజమాన్యం తీసుకున్న నిర్ణయం సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. తమ సిబ్బంది ఆత్మగౌరవానికి భంగం కలిగించిన సదరు అతిథిని హోటల్‌లోకి రాకుండా జీవితకాలం నిషేధం (బ్లాక్‌లిస్ట్) విధించింది. ఈ విషయాన్ని హోటల్ ప్రాపర్టీని నిర్వహించే సిన్నియర్ డెవలపర్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పరితోష్ లధానీ స్వయంగా ఓ లింక్డిన్ పోస్ట్ ద్వారా వెల్లడించారు.పరితోష్ లధానీ తన పోస్ట్‌లో వివరించిన ప్రకారం.. హోటల్‌లోని రెస్టారెంట్‌లో కాంతీ అనే వెయిటర్ ఒక అతిథికి సర్వీస్ అందిస్తున్నాడు. ఆ సమయంలో కమ్యూనికేషన్ గ్యాప్ కారణంగా ఇద్దరి మధ్య చిన్న అపార్థం చోటుచేసుకుంది. వెయిటర్‌కు ఇంగ్లీషులో పరిజ్ఞానం తక్కువగా ఉండటంతో పొరపాటు జరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన ఆ అతిథి, అందరూ చూస్తుండగానే వెయిటర్ కాంతీ చెంపపై కొట్టాడు.అయితే, తనను తీవ్రంగా కలచివేసిన విషయం మరొకటి ఉందని పరితోష్ పేర్కొన్నారు. ఈ ఘటన గురించి వెయిటర్ కాంతీ ఎవరికీ ఫిర్యాదు చేయలేదు. విషయం తెలుసుకున్న యాజమాన్యం, దీనిపై ఎందుకు మౌనంగా ఉన్నావని ప్రశ్నించగా, కాంతీ చెప్పిన సమాధానం వారిని కదిలించింది. తాను ఆగ్రా సమీపంలోని ఓ పేద రైతు కుటుంబం నుంచి వచ్చానని, తాజ్ హోటల్‌లో పనిచేయడం తన కల అని, దానిని రిస్క్‌లో పెట్టే ఏ పనీ చేయాలనుకోలేదని కాంతీ వివరించాడు. తన ఉద్యోగం పోతుందనే భయంతోనే అవమానాన్ని మౌనంగా భరించినట్లు తెలిపాడు.కాంతీ మాటలు విని తీవ్రంగా చలించిపోయిన పరితోష్, ఆ మరుసటి రోజే ఆ అతిథిని హోటల్ నుంచి జీవితకాలం నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. తన లింక్డిన్ పోస్ట్‌లో ఆయన దీనిపై ఘాటుగా స్పందించారు. "మా తాజ్ ఆగ్రా ప్రాపర్టీ నుంచి ఒక అతిథిని జీవితకాలం బ్లాక్‌లిస్ట్ చేశాను. మా వెయిటర్‌తో వారు ప్రవర్తించిన తీరు భయంకరమైనది. నా బృందంలోని వారిని అగౌరవపరిచే హక్కు ఎవ్వరికీ లేదు. ఇక శారీరకంగా దాడి చేయడాన్ని అస్సలు సహించను" అని ఆయన స్పష్టం చేశారు.కస్టమర్ ఎంత పెద్ద వ్యక్తి అయినా, ఎంత డబ్బు ఖర్చు చేసినా ఉద్యోగుల పట్ల అమర్యాదగా ప్రవర్తించే హక్కు వారికి లేదని ఆయన స్పష్టం చేశారు. "మన ఉద్యోగులు తమ ఆత్మగౌరవం కోసం నిలబడటానికి భయపడితే, వారి కోసం నిలబడాల్సిన బాధ్యత మనదే!" అని పరితోష్ పేర్కొన్నారు. లింక్డిన్ పోస్ట్ వేలకొద్దీ రియాక్షన్లతో వైరల్‌గా మారింది. హోటల్ యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని నెటిజన్లు ప్రశంసలతో ముంచెత్తారు. కొందరు నిందితుడిపై అధికారికంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించగా, మరికొందరు అతని పేరును ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. మొత్తంమీద కస్టమర్ సంతృప్తి ఎంత ముఖ్యమో, ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని కాపాడటం కూడా అంతే ముఖ్యమనే బలమైన సందేశాన్ని ఈ ఘటన ఇచ్చింది.

హెచ్-1బీ లక్ష డాలర్ల ఫీజు.. కసును నిలిపేయాలని కోరిన ట్రంప్ సర్కార్!

అమెరికాలో హెచ్-1బీ వీసా దరఖాస్తులపై ట్రంప్ ప్రభుత్వం విధించిన లక్ష డాలర్ల భారీ రుసుమును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ కీలక దశకు చేరుకుంది. ఈ కేసులో సమ్మరీ జడ్జిమెంట్ ద్వారా సత్వరమే తుది తీర్పు వెలువరించాలని పిటిషనర్లు కాలిఫోర్నియా ఫెడరల్ కోర్టును కోరారు. అయితే, అప్పీల్ కోర్టు నుంచి నిర్ణయం వెలువడే వరకు ఈ విచారణను నిలిపివేయాలని ప్రభుత్వం వాదిస్తోంది. ప్రస్తుతం ఈ న్యాయపోరాటం 'గ్లోబల్ నర్స్ ఫోర్స్ వర్సెస్ ట్రంప్' పేరిట కొనసాగుతోంది.అక్టోబర్ 20న కోర్టుకు సమర్పించిన సంయుక్త నివేదికలో, హెచ్-1బీ వీసాల ప్రాసెసింగ్‌కు లక్ష డాలర్లు వసూలు చేయాలన్న నిబంధన చట్టవిరుద్ధమని పిటిషనర్లు వాదించారు. మరోవైపు, ఈ కేసులో సెప్టెంబర్ 30న వెలువడిన మధ్యంతర ఉత్తర్వులను సవాలు చేస్తూ అక్టోబర్ 9న తాము నైన్త్ సర్క్యూట్ అప్పీల్ కోర్టును ఆశ్రయించామని ప్రభుత్వం పేర్కొంది. అక్కడ తీర్పు వెలువడకుండా జిల్లా కోర్టులో విచారణను కొనసాగించడం వల్ల ప్రయోజనం ఉండదని స్పష్టం చేసింది. ఈ స్టే పిటిషన్‌పై 2027 జనవరి 14న విచారణ జరగనుంది.ఈ కేసుకు సంబంధించిన పరిపాలనాపరమైన రికార్డులను నవంబర్ 3వ తేదీలోగా తమకు అందజేయాలని పిటిషనర్లు కోరుతున్నారు. ఈ వివాదాస్పద రుసుమును అధ్యక్షుడు ట్రంప్ 2025 సెప్టెంబర్‌లో 'ప్రోక్లమేషన్ 10973' ద్వారా ప్రవేశపెట్టగా, 2026 సెప్టెంబర్‌లో 'ప్రోక్లమేషన్ 11069' ద్వారా దాన్ని పొడిగించారు. అధ్యక్షుడి ఉత్తర్వులు చట్టపరిధిని మించి ఉన్నాయా, ప్రభుత్వ విభాగాలు నిబంధనలను ఉల్లంఘించాయా అనే అంశాలపై న్యాయపోరాటం సాగుతోంది. పిటిషనర్ల తరఫున జస్టిస్ యాక్షన్ సెంటర్, డెమోక్రసీ ఫార్వర్డ్ వంటి సంస్థలు వాదనలు వినిపిస్తున్నాయి.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com